క్లుప్తంగా

మధురంగా సాగిన సంగీత కచేరీ



విజయవాడ కల్చరల్: స్వరతరంగిణి ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం దుర్గాపురంలోని శివరామకృష్ణక్షేత్రంలో యువ సంగీత కళాకారిణి సోమయాజుల విష్ణుప్రియ ఇందిర నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. సంగీత త్రిమూర్తులు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, వాగ్గేయకారులు అన్నమయ్య, రామదాసు కీర్తనలు ఆలపించారు. చెన్నైకి కుందుర్తి అరవింద్, అంబటిపూటి కామాక్షి వాద్య సహకారం అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు గండూరి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ యువ గాయనీ గాయకులను ప్రోత్సహించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

దాతల భాగస్వామ్యంతోనే సమాజ అభ్యున్నతి



కంకిపాడు: సమాజ అభ్యున్నతి దాతల భాగస్వామ్యంతోనే ముడిపడి ఉందని విజయవాడ పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలోని ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో దొప్పల జోజి మాస్టర్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.10 లక్షలతో నిర్మింపజేసిన జ్ఞాపకార్థ వేదికను ఆదివారం రాత్రి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. దైవ ఆరాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. క్రీస్తు చూపిన సేవా మార్గంలో పయనించాలని ఆకాంక్షించారు. జోజి మాస్టర్ సతీమణి లూర్దు మరియమ్మ, కుటుంబ సభ్యులను బిషప్ రాజారావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఫాదర్ పోలిమెట్ల క్రీస్తురాజు, సంఘస్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గీతా మందిరంలో శాంతి హోమం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీ గీతా మందిరంలో మహా సంప్రోక్షణ కుంభాభిషేకంలో భాగంగా రెండో రోజైన ఆదివారం మహాశాంతి యాగం, మహాశాంతి కుంభారాధన కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ మహర్షి సద్గురు మలయాళస్వామి వారి దివ్యాశీస్సులతో యేర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా సంప్రోక్షణ కుంభాభిషేక కార్యక్రమాల్లో కర్మయోగ ఫలంపై చిన కంచి ట్రస్టీ ముక్కపాటి శర్మ భక్తులకు అభిభాషణం చేశారు. అలాగే ఉదయం అర్చకస్వామి రొంపిచర్ల దత్తకుమార్ బృందం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన, అగ్నిధాన్యములు, నిత్య హోమం, నవగ్రహముఖ ఆరాధన, నవగ్రహ హోమం, నివేదన, హారతి, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం లోక కళ్యాణార్థం అగ్నిధ్యానం, మహాశాంతి హోమం, పూర్ణాహుతి, నివేదన, హారతి కార్యక్రమాలు జరిగాయి. మూడు రోజుల కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజైన సోమవారం ప్రత్యేక పూజలతో పాటు శ్రీశ్రీనివాస కల్యాణ మహాదాశీర్వచనం నిర్వహించనున్నట్లు గీతా మందిరం భక్త బృందం కమిటీ తెలిపింది.

1,020 మందికి వైద్య పరీక్షలు



తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్‌లో మధుమేహ రోగులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 1,020 మంది మధుమేహం, రక్తపోటు, మూర్ఛవ్యాధిగ్రస్తులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. రక్తపోటు, మధుమేహం బారిన పడిన వారు మందులు వాడితే సరిపోదని, సరైన ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం తప్పక చేయాలని డాక్టర్ గోపాళం శివన్నారాయణ సూచించారు. రోజుకు రెండుసార్లు మాత్రమే ఆహారం తీసుకోవాలని, కనీసం ఒకపూట తృణధాన్యాలు తీసుకోవాలని చెప్పారు. వైద్యులు రవీంద్ర, సత్యతేజ, లక్ష్మణరావు, శివాజీ రోగులను పరీక్షించారు. జన విజ్ఞాన వేదిక సభ్యులు హరికృష్ణ, గంగాధర్, పాపారావు, సుభానీ పర్యవేక్షించారు.

డిపాజిట్‌దారులందరికీ న్యాయం చేయాలి

- దుర్గాకోఆపరేటివ్ బ్యాంక్ లైసెన్స్‌ను రద్దు చేసిన ఆర్‌బీఐ
- ఐదు లక్షల లోపు డిపాజిట్‌దారులకు చెల్లింపు ప్రక్రియ చేపట్టిన బ్యాంక్
- ఐదు లక్షల దాటిన డిపాజిట్లను చెల్లించాలని కోరుతున్న ఖాతాదారులు
- బ్యాంక్ లైసెన్స్‌ను పునరుద్ధరించాలని ఖాతాదారుల వినతి



దుర్గా కోఆపరేటివ్ బ్యాంక్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో 96 సంవత్సరాల చరిత్ర కలిగిన దుర్గా కోఆపరేటివ్ బ్యాంక్ తమకు న్యాయం చేయాలంటూ ఆ బ్యాంక్ ఖాతాదారులందరూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. బ్యాంక్ నిర్వహణ, అవినీతి ఆరోపణలు తదితర అంశాల నేపథ్యంలో గత నవంబర్ మాసంలో బ్యాంక్ లైసెన్స్‌ను రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే బ్యాంక్ ఆర్థికంగా పటిష్టంగా ఉన్నప్పటికీ లైసెన్స్ రద్దు చేయటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా బ్యాంకుకు సుమారు 11 వేల మంది సభ్యులు ఉన్నారు. బ్యాంక్‌లో డిపాజిట్ చేసిన ఖాతాదారులకు కొంతమందికి కాకుండా అందరికీ న్యాయం చేయాలంటూ కోరుతున్నారు. బ్యాంక్ అధికారుల తీరు, ప్రభుత్వ వ్యవహరిస్తున్న తీరుతో ఖాతారులు తీవ్రమైన ఆయోమయానికి గురవుతున్నారు.

5 లక్షల డిపాజిట్లు దాటిన వారి పరిస్థితి ఏంటి?

బ్యాంక్‌లో నగదు డిపాజిట్ చేసిన ఖాతాదారులకు వెనుకకు అందించే చర్యలు అధికారులు చేపట్టారు. డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (ఈఐఈఏఈ) ద్వారా ఐదు లక్షల లోపు డిపాజిట్ చేసుకున్న డిపాజిట్ దారులకు చెల్లించేందుకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు ఖాతాదారులకు సమాచారమందించి వారి వివరాలను నమోదు చేసుకోవాలని కోరుతున్నారు. అయితే ఐదు లక్షల నుంచి సుమారు రూ.50 లక్షల వరకు డిపాజిట్ చేసుకున్న డిపాజిట్ దారులు 298 మంది ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వారికి చెల్లించాల్సినది సుమారు రూ.30 కోట్ల లోపు ఉంటుందని తెలిసింది. వారి సంగతేమిటంటూ డిపాజిట్‌దారులు ప్రశ్నిస్తున్నారు.

బ్యాంక్ అప్పులను వసూలు చేయాలి

బ్యాంక్ నుంచి తీసుకున్న అప్పులను వసూలు చేయాలని ఖాతారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా బ్యాంక్ నుంచి సుమారు రూ.40 కోట్ల మేర అప్పులిచ్చారు. అయితే గడిచిన ఏడెనిమిది సంవత్సరాల నుంచి బ్యాంకుకు ఎవరూ సరైన చెల్లింపులు చేయకపోవటంతో ఆ అప్పులు సుమారు రూ.190 నుంచి రూ.200 కోట్లు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే గతంలో పని చేసిన అధికారులు కొంతమంది చెల్లించటానికి వచ్చిన వారిని వన్‌టైం సెటిల్‌మెంట్ పెడతారు చెల్లించవద్దని చెప్పి వెనుకకు పంపించివేశారని పలువురు ఖాతాదారులు చెబుతున్నారు. దీనివలనే అప్పులు ఇంతమేర పేరుకుపోయాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏది ఏమైనా బ్యాంకుకు రావాల్సిన అప్పులను వసూలు చేసి ఖాతాదారులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

బ్యాంక్‌ను కొనసాగించేందుకు చర్యలు చేపట్టాలి

నగరంలో పలు శాఖలతో ఎంతో చరిత్ర ఉన్న దుర్గా కోఆపరేటివ్ బ్యాంక్‌ను కొనసాగించేందుకు ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు. బ్యాంక్ లైసెన్స్ రద్దు చేసిన వెంటనే బ్యాంకు సిబ్బంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కానీ జిల్లా సహకార శాఖ అధికారులు కొంతమంది వారిని ప్రభావితం చేశారని, అందువలన వారు వెనుకకు తగ్గినట్లు ప్రచారం జరుగుతుంది. ప్రధానంగా బ్యాంకు పలు జాతీయ బ్యాంక్‌లు ఇతర ఇన్సూరెన్స్‌లు నిమిత్తం సుమారు రూ.67 కోట్లు చెల్లించటంతో ప్రస్తుతం ఆ నిధులు అందుబాటులో ఉన్నాయి. బ్యాంకు డిపాజిట్‌దారులకు చెల్లింపులు పూర్తి చేసినా ఇంకా మిగులు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దానికి తోడు బ్యాంకుకు రావాల్సిన అప్పులు రూ.200 కోట్లు వసూలు చేస్తే బ్యాంకుకు ఢోకా లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం దృష్టి పెట్టాలంటూ నగరవాసులు కోరుతున్నారు.

కుమార్తె అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): టిఫిన్ తీసుకొచ్చేందుకు కొండ దిగిన తన కుమార్తె కనిపించకుండా పోయిందని తల్లి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. కలరా హాస్పటల్ కొండ ప్రాంతంలోని జొన్నలగడ్డ మస్తాన్ వీధిలో తమ్మిశెట్టి సుమలత, వీరన్న దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం కాగా కుమార్తె భవానీకి వివాహం చేశారు. అయితే అల్లుడికి కిడ్నీ సమస్య రావడంతో వారం రోజుల కిందట భవానీ, భర్తను తీసుకుని పుట్టింటికి వచ్చింది. 16వ తేదీ ఉదయం భర్తకు టిఫిన్ తీసుకొస్తానని చెప్పి కొండ దిగిన భవానీ సాయంత్రం అయినా తిరిగి రాలేదు. దీంతో బంధువులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో తల్లి సుమలత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం, చిట్టినగర్‌లోని సర్కిల్-1, సత్యనారాయణపురంలోని సర్కిల్-2, పటమటలోని సర్కిల్-3 కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో జరిగే కార్యక్రమంలో జోనల్ కమిషనర్‌లు, స్థానిక అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలి



గ్రంథావిష్కరణ సభలో మండలి బుద్ధప్రసాద్, సంగయ్య తదితరులు

విజయవాడ కల్చరల్: సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మాధురి ప్రచురణలు ఆధ్వర్యాన సాహితీ మిత్రుల సమక్షంలో ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో డాక్టర్ లగడపాటి సంగయ్య రచించిన మూడు కావ్యాలు తెలుగు ధీర శతకం, ఆంధ్ర రఘువంశం, పల్లెపట్నం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కావ్యాలను ఆవిష్కరించిన మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ సాహిత్యానికి సమకాలీనత, సార్వజనీత ఉండాలని అన్నారు. పద్యకావ్యమైన, కవిత్వమైన, శతకమైన సమాజ శ్రేయస్సు కనిపించాలన్నారు. పద్యసాహిత్యంలో రచయిత సంగయ్య కృషిని అభినందించారు. శతావధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ కాళిదాసు మేఘసందేశం గురించి వివరించారు. విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మా సాంబశివరావు శత సాహిత్యంపై మాట్లాడారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు, లగడపాటి రమాదేవి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు డిమాండ్

మైలవరం: రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు నెలలకు పైగా ఉపాధి కూలీలకు వేతనాలు రాక వారి కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. ఉపాధి కూలీల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మైలవరం నియోజకవర్గంలో ఉపాధి పనులు జరుగుతున్న వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ఎండలు మండిపోతున్నా కనీసం మజ్జిగ, మంచినీళ్లు, టెంట్‌ల వసతి కల్పించడం లేదని కూలీలు వాపోయారు. ఆయన మాట్లాడుతూ నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలకు పైగా ఉపాధి నిధులు అవసరం ఉండగా ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుకార్చాలనే పట్టుదలతో ఉందని ఆరోపించారు. అరకొరగా ఉన్న ఈ నిధులను కూటమి ప్రభుత్వం సంబంధం లేని పనులకు కేటాయిస్తోందని విమర్శించారు. పరికరాలు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోందని, ఇది దారుణమన్నారు.

క్యాన్సర్ చికిత్సల్లో విప్లవాత్మక ఆవిష్కరణలు

ఎంపీ, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి



జ్యోతి ప్రజ్వలన చేసి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఇతర నేతలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్యాన్సర్ చికిత్సల్లో అనేక విప్లవాత్మక ఆవిష్కరణలు జరుగుతున్నాయని ఎంపీ, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు డీ పురందేశ్వరి అన్నారు. కృష్ణాజిల్లా ముళ్లపూడిలో నిర్మించనున్న సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు ఆదివారం ఆమె వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. పటమట కృష్ణవేణి రోడ్డులోని సిటిజెన్ ఫోర్స్ కార్యాలయం వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ అత్యాధునిక వైద్య సేవలు ప్రజలందరికీ అందుబాటులోకి రావాలన్నారు. ప్రజలకు మెరుగైన క్యాన్సర్ చికిత్సలు అందించేందుకు సిటిజెన్ ఫోర్స్ స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. పేద ప్రజలకు క్యాన్సర్ చికిత్సలు అందించడంలో సిటిజెన్ ఫోర్స్ మార్గదర్శిగా నిలవాలని ఆకాంక్షించారు. వైద్య రంగంలో సేవా దృక్పథం వృద్ధి చెందాలని, నూతన ఆవిష్కరణలు అందిపుచ్చుకుని ప్రజలకు మరింతగా సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ సంస్థకు రూపకల్పన చేసిన పీ రమేష్‌బాబు, తట్టి అర్జునరావు, ప్రముఖ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఎన్ సుబ్బారావు పాల్గొన్నారు.

● చల్లంగా చూడమ్మా తిరుపతమ్మ తల్లీ...



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. భక్తులతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిటకిటలాడాయి. వేకువ జాము నుంచే పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చల్లంగా చూడమ్మా తిరుపతమ్మ తల్లీ అంటూ వేడుకున్నారు. ఆలయం తరుఫున భక్తులకు నిరంతరాయంగా మజ్జిగ పంపిణీ చేశారు. మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో భక్తులు సేద తీరారు.

–పెనుగంచిప్రోలు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



ఆలయం బయట బోనాలతో భక్తుల

లారీని ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



మూలపాడు(ఇబ్రహీంపట్నం): ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సేకరించిన సమాచారం ప్రకారం.. కంచికచర్ల మండలం బత్తినపాడు గ్రామానికి చెందిన చింతపల్లి రాజు (35) గ్రామస్తులతో కలిసి వేళంకిని మాత దర్శనం కోసం ఐదు రోజుల కిందట నాగపట్నం వెళ్లాడు. గతంలో భార్య చనిపోవడంతో తన 11 ఏళ్ల కుమార్తెను గొల్లపూడిలోని తన సోదరుని ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. నాగపట్నం నుంచి ఆదివారం ఉదయం గ్రామానికి చేరుకున్న అనంతరం తన కుమార్తెను తీసుకువచ్చేందుకు బైక్‌పై గొల్లపూడి బయలుదేరాడు. మూలపాడు వద్దకు చేరుకునేసరికి బైకు అదుపుతప్పి హైవే పక్కన ఆగి ఉన్న లారీని వెనక వైపు ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాజు తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు రాజు బంధువులకు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇబ్రహీంపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

వైభవంగా ఈస్టర్ పర్వదినం

కిటకిటలాడిన క్రైస్తవ ప్రార్థనా మందిరాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఈస్టర్ పర్వదిన వేడుకలు వన్‌టౌన్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. వివిధ క్రైస్తవ ప్రార్థనా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఆయా క్రైస్తవ మందిరాల్లో వేడుకలు నిర్వహించారు. దైవకుమారుడు తిరిగి లోకంలో అరుదెంచిన పర్వదినంగా క్రైస్తవులు ఈ పర్వదినాన్ని అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు మత ప్రముఖులు ఏసుక్రీస్తు పునరుత్థానం గురించి ప్రసంగించారు. అదేవిధంగా ఈస్టర్ పర్వదినం అవశ్యకతను వివరించారు. దైవకుమారుడు తనను నమ్మిన ప్రజల బాధలను నివారించేందుకు, వారి పాపాలను దహించివేసేందుకే తిరిగి భూమి పైకి వచ్చారని ఆయా ప్రముఖుల ప్రసంగాలలో వివరించారు. ఆదివారం రాత్రి వరకూ వన్‌టౌన్‌లోని క్రైస్తవ ప్రార్థనా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆర్‌సీఎం చర్చిలో.....

భక్తుల పాప విమోచనం కోసమే ఏసుక్రీస్తు పునరుత్థానం జరిగిందని పలువురు మత పెద్దలు అన్నారు. తారాపేటలోని పురాతన సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చిలో ఈస్టర్ పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి పలు మార్లు ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి విచారణగురువులు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఈస్టర్ పర్వదినం రోజున అతన అపూర్వ మహిమలను లోకానికి చాటారన్నారు. మానవాళి కోసం ఆయన శిలువ ఎక్కి ప్రాణత్యాగం చేశారన్నారు. అనంతరం మూడో రోజున తిరిగి భక్తులకు తన దర్శనమిచ్చారని వివరించారు. ఏసుక్రీస్తు సర్వమానవాళి కష్టాలను, బాధలను నివారించి వారికి స్వస్థతను చేకూర్చేందుకు తిరిగి వచ్చారని చెప్పారు. ఏసు పునరుథనం ద్వారా ఆయన మహిమలు లోకానికి తెలియజేశారన్నారు. అంతేకాకుండా ఏసుక్రీస్తు తనను నమ్మిన భక్తులను తాను అండగా ఉంటానని ఈ ఈస్టర్ పర్వదినం రుజువు చేస్తుందన్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిచారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

సీఎస్‌ఐ చర్చిలో....

తనను నమ్మిన భక్తులకు అన్ని తానే కాపాడుతానని ఈస్టర్ పర్వదినం రోజున ఏసు తన పునరుత్థానం ద్వారా చాటి చెప్పారని పురాతన సెయింట్ పాల్ సెంటనరీ చర్చి (సీఎస్ఐ)లో మతపెద్దలు పేర్కొన్నారు. చర్చి ఆవరణలో ఆదివారం పలు విశేష కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరాధన క్రమాన్ని చర్చి నిర్వాహకులు నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు ప్రార్థనలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణలో....

సర్వమానవాళి కోసమే ఏసుక్రీస్తు ఆగమనం జరిగిందని క్రైస్తవ మతబోధకలు పేర్కొన్నారు. బాబు రాజేంద్రప్రసాద్ రోడ్డులోని తెలుగు బాప్టిస్ట్ సెంటినరీ చర్చి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో క్రైస్తవ ప్రముఖులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ద్వారా సమాజంలోని చెడును రూపుమాపవచ్చని చెప్పారు. ఈస్టర్ పర్వదినం ఏసుక్రీస్తు మహిమను చాటిన రోజుగా పేర్కొన్నారు.

సేవలు విస్తృతం చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజానికి అవసరమైన సేవలను మరింత విస్తృతం చేయాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. భారత్ వికాస్ పరిషత్ విజయవాడ డివిజన్ నూతన కార్యవర్గ సమావేశం ఆదివారం పాతబస్తీలోని ఒక ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వేముల హజరత్తయ్యగుప్తా మాట్లాడుతూ నాయకులలో సేవా తత్పరత వెల్లివిరియాలన్నారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను నేటి తరానికి అందించేందుకు దేశ ప్రధాని స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షులు పెనుగొండ సుబ్బరాయుడు మాట్లాడుతూ భారత్ వికాస్ పరిషత్ సేవలను కొనియాడారు. ముందు పని చేసిన ప్రముఖుల సేవలను కొనసాగిస్తూ సమాజానికి మరిన్ని సేవలందించాలని సూచించారు. సంస్థ నూతన అధ్యక్షుడిగా చందోలు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కడం కష్టమూర్తి, కోశాధికారిగా బ్రహ్మానందం తదితరులతో సంస్థ సీనియర్ నేత ఎస్.శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. సంస్థ ప్రముఖులు బి.మల్లికార్జునరావు, టీవీ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

● ఆదివారం ఆటవిడుపు...



విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం ఆదివారం కిటకిటలాడింది. సెలవు కావడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు స్టేడియానికి చేరుకొని వివిధ రకాల ఆటలు ఆడారు. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన స్కూల్ స్థాయి నుంచి కళాశాలలో చదివే విద్యార్థుల వరకు భారీగా స్టేడియానికి వచ్చారు. ఎక్కువ మంది క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. జట్లుగా ఏర్పడి క్రికెట్ పోటీలు నిర్వహించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసుల స్పెషల్ డ్రైవ్



తిరువూరు: రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా లారీ డ్రైవర్లకు స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో కార్యక్రమాన్ని తిరువూరు పోలీసులు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు సూచనల మేరకు విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై రాత్రివేళల్లో నిద్రలేమితో వాహనాల డ్రైవర్లు ప్రమాదాలకు గురవుతున్నందున తెల్లవారు ఝామున 3 నుంచి 5 గంటల సమయంలో వారు కొద్దిసేపు విశ్రాంతి తీసుకునే విధంగా తిరువూరు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది జాతీయ రహదారిపై భారీ వాహనదారులకు స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో కార్యక్రమం నిర్వహిస్తున్నారు.